క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మక్తల్: నియోజకవర్గంలోని ఆయా పాఠశాలలకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీ చందర్‌రెడ్డి అందించిన పరీక్ష ప్యాడ్లను స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు లక్కీ డిప్ ద్వారా రూ.2,00,116 ఉచితంగా బహుమతిగా అందిస్తామని తెలిపారు. పాఠశాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నర్వ: యాంకి మాజీ సర్పంచ్ వై. వెంకటేష్ జన్మదినం సందర్భంగా సోమవారం ప్రభుత్వ పాఠశాలలో 70 మందికి పలకలు, పరీక్ష ప్యాడ్లను వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శ్రీనిత్యా, రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

కోస్గి: కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.రాజారాంను నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం 2024–25 నుంచి మహిళ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు తీసుకుంటున్నామని, బీఏ, బీకాం, బీఎస్సీ(లైఫ్ సైన్స్) బీఎస్సీ(ఫిజికల్ సైన్స్) గ్రూపులు ఉంటాయని తెలిపారు. ప్రతి గ్రూపులో 60 సీట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ వితరణ

నర్వ: మండలంలోని లక్కర్‌దొడ్డి అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన పెద్ద మల్లేష్ టీవీని అందజేశారు. చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్యాబోధన చేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అంగన్‌వాడీ సిబ్బంది అన్నారు. కార్యక్రమంలో అంజి, హనుమంతు, తిరుపతన్న, రాజు, వెంకటేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ధన్వాడ: మండలంలోని మందిపల్లితండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రెండు రోజుల్లో పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఏఈ ప్రవీణ్ పనులను పరిశీలించారు.

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్‌లోని బీసీ కాలనీలో సోమవారం సీసీ రోడ్డు పనులకు మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, అంజప్ప, అనంతరాములుగౌడ్, అశోక్, రాంచందర్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

నర్వ: మండలంలోని ప్రధాన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అసెంబ్లీలో గళమెత్తిన గొప్ప నాయకుడు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఎన్నో ఏళ్లుగా అర్ధాంతరంగా చదువులను మధ్యలోనే మానేస్తున్న పేద విద్యార్థుల కోసం ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో మాట్లాడి సమస్య సాధనకు కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. బల్‌రాంగౌడ్, మల్లేష్, జబ్బార్, జనార్ధన్‌రెడ్డి, అజిత్‌సింహారెడ్డి తదితరులున్నారు.

మద్దూరు తహసీల్దార్‌గా మహేష్‌గౌడ్



మద్దూరు: మండల తహసీల్దార్‌గా మహేష్‌గౌడ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లా తాండూరులో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై వచ్చారు. మద్దూరులో విధులు నిర్వహిస్తున్న జయరాములు దామరగిద్దకు బదిలీపై వెళ్లారు. మండలంలో రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

మద్దూరు: తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న యువకుడు ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని భీంపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్ కథనం మేరకు గ్రామానికి చెందిన కానగడ్డ భీమేష్ (19) కొన్ని నెలలుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. పనులపై బయికి వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటి చేరే సరికి దూలానికి ఉరివేసుకున్నది గ్రహించి నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడు. మృతుడి అన్న శ్రావణ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



మద్దూరులో..



మక్తల్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న ధార్మిక సంఘం నాయకులు

ఘనంగా శివాజీ జయంతి ఉత్సవాలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో సోమవారం శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక చౌక్‌సెంటర్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గాంధీనగర్ వీధిలో బజరంగ్‌దళ్, హిందూవాహిని ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. సూర్యవంశ క్షత్రియ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్‌లో వేడుకలు నిర్వహించారు.

కృష్ణా: దేశరక్షణ కోసం ప్రతి యువకుడు ఓ వీర శివాజీలా తయారు కావాలని యువజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ఖాన్‌దొడ్డి, ముడుమాల్, హిందుపూర్, కున్సి, గుడెబల్లూర్, కృష్ణాలో సోమవారం శివాజీ జయంతి సందర్భంగా గ్రామాల్లో యువకులు ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడలిలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మక్తల్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నల్లజానమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం నుంచి ట్రాక్టర్‌పై ఊరేగింపును ర్యాలీ ప్రారంభించారు. మక్తల్ పట్టణంలో హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలో ఆంజనేయస్వామి దేవాలయంలో వద్ద శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పడమటి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



మరికల్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

మరికల్: మండల కేంద్రంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, ఛత్రపతి యువసేన సంఘం ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రాయచూర్ రోడ్డు నుంచి విగ్రహంతో ఊరేగింపుగా శోభాయాత్రను నిర్వహించారు.

మద్దూరు: శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో రామాలయం నుంచి శివాజీ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు.

కోస్గి: నేటి తరం యువత శివాజీ అడుగు జాడల్లో నడిచి దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని వివేకానంద సామాజిక సేవా సమితి రాష్ట్ర ప్రచారక్ కృష్ణస్వామి సూచించారు. సోమవారం శివాజీ జయంతిని పురస్కరించుకొని శివాజీ చౌరస్తాలో హిందూ వాహిని, ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీతోపాటు పలు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నర్వ: రాయికోడ్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు.

దామరగిద్ద: శివాజీ చూపిన పరాక్రమం ఆదర్శనీయమని పలువురు అన్నారు. సోమవారం మండలంలోని కాన్‌కుర్తిలో శివాజీ చిత్రపటానికి పూజలు నిర్వహించారు.



రాయికోడ్‌లో ..



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న వక్తలు



ఖాన్‌దొడ్డిలో..



కోస్గిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



కాన్‌కుర్తిలో..

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పాతతండాలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

నారాయణపేట రూరల్: మండలంలోని పిల్లిగుండ్ల తండా పంచాయతీ పాతతండా ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరప్ప, కురుమూర్తి, శంకర్‌నాయక్, వినోద, భీమేశ్వరి, చంద్రశేఖర్‌నాయక్, తిరుపతి, మల్లేష్‌నాయక్ పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని కన్మనూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తరగతి గదిలోనే ఉపాధ్యాయులుగా బోధించారు. విద్యార్థులను హెచ్‌ఎం లక్ష్మితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. మండల కేంద్రంలోని వెంకటసాయి ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

మద్దూరు: సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడానికి ఈ నెల 21న వస్తున్నారని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి జీఓ 14 ద్వారా నిధులు మంజూరు చేసి కోస్గిలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే మద్దూరులో రూ.20 కోట్లతో చేపట్టే గురుకుల పాఠశాల భవనం, రోడ్డు విస్తరణ పనులు, అన్ని డబుల్, సింగల్ రోడ్ల పనులకు అక్కడే శంకుస్థాపనలు చేస్తారని వారు పేర్కొన్నారు. ఉమ్మడి మద్దూరు మండలం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. సంజీవ్, బాబుస్వామి, వీరేష్‌గౌడ్, చంద్రమోహన్, మల్లికార్జున్, భీములు, హుసేన్ తదితరులు ఉన్నారు.

కోస్గి: మొదటిసారి నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న రెండు నెలల వ్యవధిలోనే నియోజకవర్గానికి రూ.4,200 కోట్ల నిధులు మంజూరు చేయడంతోపాటు వెంటనే పనులకు భూమి పూజలు, శంకుస్థాపనలు చేసేందుకు రేవంత్‌రెడ్డి కోస్గికి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్ కుమార్, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, బెజ్జు రాములు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రమాదకరంగా రోడ్డు మలుపులు

ఊట్కూర్: రోడ్డు మలుపుల వద్ద ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఊట్కూర్, మొగ్దుంపూర్, బిజ్వార్, పులిమామిడి, అవుసలోనిపల్లి సమీపంలో రోడ్డు మలుపులు అధికంగా ఉన్నాయి. మలుపుల వద్ద ఆర్‌అండ్‌బీ, పీఆర్ అధికారులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో మలుపులు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో బిజ్వార్ సమీపంలో రోడ్డు మలుపు దగ్గర పెద్దజట్రం చెందిన యువకుడు రోడ్డు పక్కన గుంతలో పడి మృతి చెందాడు. పులిమామిడి సమీపంలో ద్విచక్రవాహనం, సైకిల్ ఢీకొని బిజ్వార్ చెందిన వ్యక్తి మృతి చెందాడు. మొగ్దుంపూర్ సమీపంలో మక్తల్ మండలానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రోడ్డు మలుపుల వద్ద, రోడ్డుకు ఇరువైపుల ముళ్లపొదలు భారీగా పెరిగాయి. ఉన్నతాధికారులు స్పందించి మలుపుల వద్ద ముళ్ల పొదలను తొలగించాలని, ప్రమాద సూచికలతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మొగ్దుంపూర్ గ్రామ సమీపంలో రోడ్డు మలుపు

కనులపండవగా బీరప్పస్వామి బండారోత్సవాలు

మరికల్: ఐదేళ్లకోసారి నిర్వహించే బీరప్పస్వామి బండారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న కుర్వ కులస్తులపై బంధువులు బండారు వేశారు. అనంతరం కొత్త దుస్తులు ధరించి ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. తీలేర్‌లో బీరప్పస్వామి బండారోత్సవాల ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలో కుర్వ కులస్తులు బీరప్ప ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మొదటిరోజు పెళ్లీడుకు వచ్చిన వారిని పట్టం కట్టడం, రెండో బీరప్పస్వామి బండార (పసుపు), మూడో రోజు తమ మొక్కులు దేవతలకు గొర్రెలు, మేకలు, కోళ్లు బలిస్తారు. నాల్గవ రోజు యల్లమ్మ బండార కార్యక్రమం పసుపుతో ఉత్సవాలు ముగుస్తాయి. సోమవారం పట్టణంలో బీరప్పస్వామి దేవాలయం వద్ద బండారు కార్యక్రమం నిర్వహించారు. కుర్వకులస్తులు పసుపు శరీరంపై చల్లుకుంటే తమకు సుఖసంతోషాలు కలుగుతాయని ఇంట్లో అన్ని శుభాలు జరుగుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవాల్లో దాదాపు 30 వేలు మంది భక్తులు రావటంతో సౌకర్యాలకోసం టెంట్లు వేసి కొత్త వస్త్రాలు ధరించి పసుపు బండారును చల్లుకునేందుకు పోటీపడ్డారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీద బండార కార్యక్రమం ప్రారంభించారు.



బండారు చల్లుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మరికల్‌లో బీరప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



మక్తల్‌లో చిన్నారులకు పట్టం కడుతున్న భక్తులు



మరికల్‌లో బండారోత్సవాల్లో పాల్గొన్న భక్తులు



మక్తల్‌లో కుటుంబసమేతంగా కూర్చున్న కుర్వకులస్తులు

మాణికేశ్వరి ఆలయం ప్రారంభం





ప్రతిష్ఠాపించిన నాగసింహాసన విగ్రహం.. మాణికేశ్వరి ఆలయం

మరికల్: మండలంలోని మాధవరంలో మాత మాణికేశ్వరి ఆలయం సోమవారం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆలయంలో నాగ సింహాసనం, పదుకలను యానగొంది మాణికేశ్వరి భక్తుడు శివయ్య చేతుల మీదుగా ప్రతిష్ఠాపించారు. గ్రామ శివారులోని గుట్టపై నిర్మించిన ఆలయాన్ని గ్రామస్తులు దర్శించుకొని పూజలు చేశారు. అక్కడికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేటినుంచి లింగంపల్లి ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ తల్లి మూలవిరాట్

నారాయణపేట రూరల్: జిల్లాలో లింగంపల్లి జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 20న గ్రామంలో ఎల్లమ్మతల్లి విగ్రహ ఊరేగింపు, అమ్మవారికి పెద్ద బోనం కుండ, సాయమ్మనోటికి తాళం ఘట్టం, అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇప్పటికే జాతర ప్రాంగణంలో పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి వసతి, విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు సైతం పోలీసులు తగు జాగ్రత్తలు చేస్తున్నారు. ఐదు మంగళవారాల పాటు జనాలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది.

టీఎస్ యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

కోస్గి: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండలస్థాయి సమావేశంలో మండల గౌరవ అధ్యక్షుడిగా కృష్ణగౌడ్, అధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా నార్యా నాయక్, సహ అధ్యక్షులుగా ఉమాదేవి, భవ్యశ్రీ, భాను ప్రకాష్, రాములు, కోశాధికారిగా శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీటితోపాటు పలు అనుబంధ కమిటీలను ఎన్నుకున్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ ప్రతినిధులు

ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ చెందిన ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం మహబూబ్‌నగర్ భగీరథ కాలనీలోని కన్వెన్షన్ హాల్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి 75 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని, గ్రామంలో నిరుద్యోగలకు శిక్షణ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అత్యవసర సమయాల్లో షీటీం రక్షణ

నారాయణపేట రూరల్: మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై గుర్తుంచుకోవాలని షీ టీం ఏఎస్‌ఐ శ్రీదేవి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే 100, 1930 మహిళా హెల్ప్ లైన్ నంబర్, 87126 70398 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతో పాటు మగపిల్లల్లోను మార్పు రావాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన

కోస్గి: పట్టణంలోని పాఠశాలలను సోమవారం జిల్లా మానిటరింగ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎస్‌ఏ–1, ఎఫ్‌ఏ–1, 2, 3లకు సంబంధించిన సమాధాన పత్రాలతోపాటు సీసీఈ రికార్డులను పరిశీలించారు. సబ్జెక్ట్‌ల వారీగా పాఠశాలలోని ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్స్‌ను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను తనిఖీ చేశారు. మానిటరింగ్ బృందంలో హెచ్‌ఎం సత్యనారాయణతోపాటు ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం



మక్తల్: మండలంలోని సామాన్‌పల్లిలో డ్రెయినేజీ పనులను జెడ్పీ చైర్‌పర్సన్ వనజ సోమవారం పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జగన్‌మోహన్, కుర్మయ్య, రాములు, నారాయణ, కొండన్న పాల్గొన్నారు.

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఊట్కూరు: మండలంలోని కొల్లూరులో అనారోగ్యంతో మృతి చెందిన పాతింటి వెంకట్‌రెడ్డి కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట మైపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఈశ్వర్, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డిలో సోమవారం మారెమ్మదేవత విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకుల అధ్వర్యంలో ఉదయం అభిషేకంతో పాటు కుంకుమార్చన, కలశపూజ, ధ్వజ, గంగా, మహా మంగళ హారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

షిరిడీ సాయి బాబా విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన విగ్రహం

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో కొత్తగా నిర్మించిన షిరిడీ సాయి ఆలయంలో మూడు రోజుల ప్రత్యేక పూజలు అనంతరం సోమవారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు, అభిషేకం చేపట్టారు.

విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయండి

కోస్గి: రాష్ట్ర వ్యాప్తంగా 20న ప్రారంభం కానున్న బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలని యాత్ర సహ ప్రముఖ్ బంటు రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు. యాత్ర జిల్లాలోని కృష్ణా నుంచి ప్రారంభమవుతుందని, కేంద్ర మంత్రి స్మృతి ఇరాని ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. 22న కోస్గిలో రోడ్‌షో, అదేరోజు కొడంగల్‌లో బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు.